క్లుప్తంగా

ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు



పెనమలూరు: ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖాధికారి కనకమేడల శైలజ అన్నారు. పెనమలూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు వరి కోతలను ముమ్మరం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 1,732 హెక్టార్లలో 5,779 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మిగతా రైతులు కూడా వరి కోతలు కోయాలని చెప్పారు. సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు మాట్లాడుతూ మినుము పంట ఈ ప్రాంతంలో అంతగా సాగుకు పరిస్థితులు అనువుగా లేనందున దాళ్వా సాగుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దాళ్వా సాగులో తమకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేపడితే సహించేది లేదు



కంకిపాడు: రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేపడితే సహించేది లేదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. మాల జేఏసీ ఆధ్వర్యంలో కంకిపాడు లాకుల వద్ద గల అంబేడ్కర్ పార్కు సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి మంగళవారం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నెల 15న చేపట్టిన హలో మాల.. చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ చేపడితే ప్రభుత్వ పీఠాలు కదులుతాయన్నారు. పాలకులు దిగి వచ్చే వరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ కో ఆర్డినేటర్ బి.నాగరాజు, బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నేత గుదే జయప్రకాష్, నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, తాడితోటి నరసింహారావు, దాసరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరం బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి చైర్మన్ బాలాజీ సందర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థల పురాణాన్ని వివరించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. పర్యాటక పరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. రెవెన్యూ శాఖతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో డీపీఆర్ తయారు చేయిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, టూరిజం రీజనల్ మేనేజర్ చైతన్య, సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పెనమలూరు: వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏడుగురు బాధితులకు రూ.8,10,786 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, నాయకులు పాల్గొన్నారు.

గన్నవరంలో చెక్కుల పంపిణీ

గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న నియోజకవర్గానికి చెందిన 12 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.14.88 లక్షలు మంజూరయ్యారు. ఈ మేరకు స్థానిక శాసనసభ్యుని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గన్నవరానికి చెందిన ఆర్.భూషణంకు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తోందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం ప్రజలు క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతలపై కోతల భారం

- గాలులు, మోస్తరు వర్షాలకు నేలవాలిన వరి చేలు
- ఎకరాకు రూ.7 వేలు వరకు పెరిగిన కోత ధర
- అదనపు భారంతో రైతుల్లో ఆందోళన



గొడవర్రులో నేలవాలిన వరి చేను

కంకిపాడు: అడుగడుగునా అన్నదాతలను కష్టాలు వెంటాడుతున్నాయి. సమస్య తీరిందని ఊరట పొందే లోపే మరో సమస్య రైతులను చుట్టుముడుతోంది. వరుసగా వచ్చి పడుతున్న కష్టాలతో రైతులు కుదేలవుతున్నారు. పంట చేతికి అందే తరుణంలోనూ అదనపు భారం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 34,977 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రధానంగా ఎంటీయూ, బీపీటీ, ఇతర సాధారణ రకాలను రైతులు సాగు చేశారు. గడిచిన 20 రోజులుగా నియోజకవర్గం వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయా మండలాల్లో కోత కోసిన ధాన్యం 27 వేల టన్నులకు పైగా ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సమస్యలు..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులను సమస్యలు వెంటాడుతున్నాయి. సాగు ఆరంభం నుంచి అగచాట్లు ఎదుర్కొన్నారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, కృష్ణానది ఏటిపాయకు వచ్చిన భారీ వరదల కారణంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న సుమారు 8,500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. నష్టాన్ని దిగమింగి సాగులో నిమగ్నమైన రైతులకు ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. మొన్న ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన మోస్తరు వర్షం, వీచిన చల్లని గాలులకు చాలా గ్రామాల్లో ధాన్యం మిల్లులకు తరలించటం సమస్యగా మారింది. మొలకలు వచ్చి ఆర్థికంగానూ నష్టపోయారు.

నేలవాలిన వరి 'భారం'..

ఇవి చాలదన్నట్లు కోతకు వచ్చిన వరి చేలు నేలవాలాయి. గంటకు రూ.3200 చొప్పున ఎకరం వరి పంట మిషనుతో కోయిస్తున్నారు. అయితే పంట చేలు నేలవాలటంతో కోత యంత్రాల యజమానులు కోత రేటును కూడా డిమాండ్‌ను బట్టి పెంచేస్తున్నారు. బిల్లు మగతా కింద గంటకు రూ.3500 చొప్పున ఒప్పందం చేసుకుని కోత కోస్తున్నారు. పంట నేలవాలటంతో ఎకరం కోతకు గంటన్నర నుంచి రెండు గంటలకు పైగా సమయం పడుతుంది. దీంతో కోత ఖర్చు సుమారు రూ.7 వేలు చేరుతోంది. మరో వైపు కోతలు ముమ్మరం కావటంతో యంత్రాలు కూడా లభ్యత లేకపోవటంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. పంట నేలవాలితే ఎకరాకు 5 నుంచి 7 బస్తాల వరకూ ధాన్యం వృథాగా పోయే అవకాశం ఉందని అన్నదాతలు చెబుతున్నారు. కోత ఖర్చులకు తోడు, ధాన్యం వృథా అదనపు నష్టాన్ని మిగుల్చుతుందని వాపోతున్నారు. చేతికి వచ్చిన పంటను దక్కించుకుని మిల్లులకు తరలించే పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు.

> **కోత ఖర్చులు భారం..**
>
> 
>
> నేను కౌలు వ్యవసాయం చేస్తున్నా. 40 ఎకరాలకు గానూ 20 ఎకరాల ధాన్యం మిల్లులకు వెళ్లింది. ఇంకా 20 ఎకరాల్లో కోత కోయాలి. పొలాలు గాలులకు నేలవాలుతున్నాయి. కోతకు రూ.7 వేల వరకూ అయ్యే అవకాశం ఉంది. ధాన్యం కూడా 5 బస్తాలకు పైగా వృథా పోయే పరిస్థితి. పంట చేతికి వచ్చే తరుణంలో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.
>
> – యనమదల వెంకటేశ్వరరావు, కౌలురైతు, మద్దూరు

మానవ హక్కుల ప్రాముఖ్యతపై ర్యాలీ



మడిచర్లలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని మడిచర్ల, రేమల్లేలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మడిచర్లలోని ఎంపీపీ స్కూల్, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మానవ హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మానవ హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటి నాయకుల గురించి తెలియజేశారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రేమల్లే జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ విస్తృత పర్యటన



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

ఉయ్యూరు: మండలంలోని కడవకొల్లు, కాటూరు గ్రామాల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. పాఠశాలలను సందర్శించి చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని రుచి చూశారు. ప్రతి నెలా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరుగుతున్న తీరు, పిల్లల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారు. ఎన్‌సీడీ 3.0 సర్వేను సమర్థంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హిమబిందు, డాక్టర్ కిరణ్, డాక్టర్ శివరామకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి నాగార్జున, బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు మండలానికి 12 రేషన్ షాపులు మంజూరు

పెనమలూరు: మండలంలో కొత్తగా 12 రేషన్ షాపులు మంజూరయ్యాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వివరాలు తెలుపుతూ మండలంలో ప్రస్తుతం రేషన్ షాపులు 54 ఉన్నాయి. అయితే 800 రేషన్‌కార్డులకు పైగా ఉన్న రేషన్ షాపులను విభజించారు. దీంతో 12 రేషన్ షాపులు అదనంగా ఏర్పడ్డాయి. షాపుల వివరాలు ఇలా ఉన్నాయి. కానూరు చలసానినగర్‌లో ఉన్న రేషన్ షాపులో 1,213 కార్డులు ఉండటంతో విభజించి 540 కార్డులతో కొత్త రేషన్‌షాపు, అలాగే డీఎస్‌ఆర్‌కాలనీలోని రేషన్ షాపులో 1082 కార్డులు ఉండటంతో 423 కార్డులతో కొత్త రేషన్ షాపు, రేకుల మసీదు వద్ద రేషన్ షాపులో 1,153 కార్డులు ఉండగా 428 కార్డులతో కొత్త రేషన్ షాపు, వరలక్ష్మీపురంలో రేషన్ షాపులో 1,014 కార్డులు ఉండగా కొత్తగా 416 కార్డులతో విడకొట్టి కొత్త రేషన్ షాపునకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. అదే విధంగా పోరంకి పరిధి పెనమలూరు సెంటర్‌లో ఉన్న రేషన్ షాపులో 1,019 రేషన్ కార్డులు ఉండగా 517 కార్డులతో విభజించి కొత్త రేషన్ షాపు, పోరంకి కృష్ణవేణి రోడ్డులో రేషన్‌షాపులో 1,021 కార్డులు ఉండగా 486 రేషన్‌కార్డులతో కొత్త రేషన్ షాపు, పోరంకి కుమ్మరిబజార్‌లో 1,012 కార్డులు ఉన్న రేషన్ షాపును విభజించి 488 రేషన్‌కార్డులతో కొత్తగా షాపు ఏర్పాటు చేయనున్నారు. పోరంకి నిడమానూరు రోడ్డులో 1,002 రేషన్ కార్డులతో ఉన్న రేషన్ షాపును విడకొట్టి 475 కార్డులతో కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేస్తారు. పెదపులిపాకలో 1,413 రేషన్ కార్డులతో ఉన్న షాపును విభజించి 627 కార్డులతో మరో షాపు, గంగూరులో నలంద స్కూల్ వద్ద 911 రేషన్‌కార్డులతో ఉన్న షాపును 457 కార్డులు విభజించి మరో రేషన్ షాపు ఏర్పాటు చేయనున్నారు. వణుకూరు ఆర్‌సీఎం చర్చి వద్ద ఉన్న రేషన్ షాపులోని 835 కార్డులు విభజించి 420 కార్డులతో మరో షాపు, గోసాల ఈదులడొంకలో 966 కార్డులతో ఉన్న రేషన్ షాపును విడతీసి 499 కార్డులతో మరో రేషన్ షాపు పెడతారు. ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసి కొత్తగా రేషన్ డీలర్లను ఎంపిక చేయనున్నారు.

రెవెన్యూ సేవలు మెరుగ్గా అందించేందుకు చర్యలు



జగన్నాథపురంలో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ భావనారాయణ

కంకిపాడు: రెవెన్యూ సేవలు మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వి.భావనారాయణ అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎఫ్ లైన్‌కు 4, పట్టాదారు పాసు పుస్తకాలకు 7, ఆధార్ అనుసంధానానికి, కుల ధ్రువీకరణ పత్రానికి ఒక్కో అర్జీ చొప్పున మొత్తం 13 అర్జీలు అందాయన్నారు. తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ రెవెన్యూ సేవలను మెరుగ్గా, త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నబోయిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మండల సర్వేయర్ భాస్కర్‌రావు, ఆర్‌ఐ ఉస్మాన్, వీఆర్వో డేవిడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన నిల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆదరణ కరువైంది. అరకొరగా రైతులు హాజరుకాగా, కేవలం ఒక అర్జీ మాత్రమే అధికారులకు అందింది. పట్టాదారు పాసుపుస్తకం, భూ సర్వే సంబంధిత సమస్యలపై రైతులు, భూయాజమానులకు సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బాపులపాడు తహసీల్దార్ వి.నాగభూషణం వివరించారు. వీఆర్వో తేరేజమ్మ, గ్రామ ప్రముఖుడు వేగే కృష్ణారావు పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు ధర అందించాలి



గారపాడులో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘాల నాయకులు

ఉంగుటూరు: రైతులు పండించిన పంటకు దళారుల మధ్యవర్తిత్వం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను అందించి రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీవీ లక్ష్మణస్వామి కోరారు. మండలంలోని పొణుకుమాడు, ఆముదాలపల్లి, గారపాడు గ్రామాల్లో కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు వరి కోతలు కోసిన రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను మంగళవారం తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేకపోవడం, ధాన్యం సేకరణకు అవసరమైన సంచులు కూడా రైతుల సేవా కేంద్రాల్లో అందుబాటులో లేవన్నారు. వాతావరణ మార్పుల వలన రైతుల గుండెల్లో రైళ్లు పరుడగెడుతున్నాయని చెప్పారు. దళారులకు లేని నిబంధనలు రైతు, కౌలు రైతులకు ఎందుకు వర్తిస్తున్నాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దళారులకు సంబంధం లేకుండా రైతులకు గిట్టుబాటు ధరను అందించాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గసభ్యులు అజ్మీర వెంకటేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి రామరాజు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. బాపులపాడుకు చెందిన కాకాని సత్యవాణి తన తండ్రి మాదాల బాబూరావు పేరిట ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

14న ప్రసాదంపాడులో జాబ్ మేళా

రామవరప్పాడు: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ నెల 14న విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు టీడీపీ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో నిరక్ష్యాసుల నుంచి పీజీ విద్యార్హత వరకు పలు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు 97011 12668, 96423 33668 నంబర్లలో సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

యనమలకుదురులో చోరీ

పెనమలూరు: యనమలకుదురులో చోరీ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌లో ఎండీ సుభాని నివాసం ఉంటున్నాడు. అతను ఇంట్లోనే టీవీ మెకానిక్ పనులు చేస్తాడు. అతని భార్య కొద్ది కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య చనిపోవటంతో అతను గ్రామంలోని అతని తండ్రి ఇంటి వద్ద రాత్రి సమయాల్లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అతని ఇంటి తాళాలు గుర్తు తెలియని దొంగలు పగుల కొట్టి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేశారు. 22 తులాల బంగారం చోరీ జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ఉయ్యూరు: పేదరిక నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జి.వి.శేషగిరిరావు అన్నారు. సుస్థిర లక్ష్యాలపై ఆకునూరు, చిన ఓగిరాల, పెద ఓగిరాల, గండిగుంట, కడవకొల్లు, గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఉయ్యూరులో వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ.. ఆకలి బాధలు నివారించి, పౌష్టికాహారాన్ని అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ పి.మురళి, ఎంఈఓ సుధారాణి, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

రేపు ఎస్‌ఆర్‌ఆర్‌లో జాబ్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేకేసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీ గురువారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్ బాబు తెలిపారు.

చిక్కవరం కొండపై హనుమంతుని పాదముద్ర



హనుమంతుని పాదముద్ర

గన్నవరంరూరల్: గన్నవరం మండలంలో హనుమంతుని పాదముద్ర గుర్తించినట్లు శ్రీక్షేత్ర హనుమత్‌పురం నిర్వాహకుడు చిట్టినేని వంశీకృష్ణ వెల్లడించారు. మండలంలోని గొల్లనపల్లి శివారు, చిక్కవరం గ్రామానికి ఉత్తర దిక్కున ఉన్న కొండ మీద రమణీయమైన ప్రకృతిలో ఔషధ గుణాలు కలిగిన వృక్షాల సమూహం ఉంది. హనుమత్ దీక్షలో ఉన్న కొందరు గొర్రెల కాపరులు మంగళవారం ఆ కొండపైన భారీ పాదముద్రను పోలిన గుంతను గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడికి సమీపంలో ఉన్న శ్రీక్షేత్ర హనుమత్‌పురం దేవస్థానం నిర్వాహకులకు తెలిపారు. ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీకృష్ణ తదితరులు వారు చెప్పిన ప్రదేశానికి వెళ్లి అది హనుమంతుని పాదముద్రగా వెల్లడించారు. ఎంతో విశిష్టత కలిగిన పాదముద్ర కాలానుగుణంగా మరుగున పడి నేడు వెలుగు చూసిందని, విషయం తెలుసుకున్న స్థానికులు వెళ్లి భక్తి పారవశ్యంతో పూజలు చేసినట్లు తెలిపారు. ఇక్కడికి రహదారి ఏర్పాటు చేస్తే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందని భక్తుల అభిప్రాయం.

నిడమనూరులో రోడ్డు నిర్మాణంపై దుమారం



నిడమనూరులో నిర్మిస్తున్న రోడ్డు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో రోడ్డుపై రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి పోరంకి వెళ్లే రోడ్డులో మాదల కోటేశ్వరరావు ఇంటి వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.5 లక్షలతో ఇరువైపులా డ్రెయిన్లు, రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న రహదారి కూడా సిమెంట్ రోడ్డు కావడం గమనార్హం. బాగున్న రోడ్డుపై మరల రోడ్డు వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం టీడీపీకి చెందిన వారు ఈ ప్రాంతంలో ఉండటంతోనే వారి ఒత్తిడి మేరకు రోడ్డుపై రోడ్డు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధికి నోచుకోని రహదారులు ఎన్నో ఉన్నా వాటిని పట్టించుకోకుండా ఇలా రోడ్డుపై రోడ్డు వేసి ప్రజాధనం వృథా చేస్తున్నారని మండిపడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి ఎన్.నరసింహారావును వివరణ కోరగా.. రూ.25 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో 4 అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ రహదారి కూడా పల్లంగా ఉండటంతో రోడ్డు వేస్తున్నామని చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువులు



బాధితులకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రామవరప్పాడు: ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులకు రామవరప్పాడులోని టీజీఆర్ ట్రస్ట్ అండగా నిలిచింది. నగరంలోని వాంబే కాలనీ, రాజీవ్‌నగర్, జక్కంపూడి, భవానీపురం ప్రాంతాల్లోని బాధితులకు ఎనికేపాడులోని షాలోమ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో మంగళవారం టీజీఆర్ ట్రస్ట్ నిత్యావసర వస్తువులు అందజేశారు. పూర్తిగా నష్టపోయిన 150 మంది బాధితులకు 1,750 కుర్చీలు, 350 కార్పెట్స్, 150 బస్తాల రైస్, నిత్యావసర కిట్లు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ తుమ్మల సత్యం మాట్లాడుతూ.. వరదల సమయంలో వరద ప్రాంతాల్లో సంచరించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రస్తుతం తీవ్రంగా నష్టపోయిన బాధితులకు తమ వంతు ఆదుకునేందుకు ఈ నిత్యావసర కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వంగూరి సురేష్, కందుల కుమారి, తుమ్మల సింధు శోభిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన



రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గన్నవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు మాట్లాడుతూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ సంపదను అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. వీరిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కనీసం విచారణ జరిపేందుకు కూడా కేంద్ర ముందుకురావడం లేదని చెప్పారు. ఇప్పటికైనా అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చించాలని, అధిక ధరలను నియంత్రించడంతో పాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. పార్టీ నాయకులు పెద్దు వెంకటరత్నం, కాట్రగడ్డ రామచంద్రజోషి, శనగల సుబ్బారెడ్డి, కట్టవరపు విజయరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం.. అటల్ ఎఫ్‌డీపీ



అటల్ ఎఫ్‌డీపీ పర్యటనలో అధ్యాపకుల బృందం

విజయవాడస్పోర్ట్స్: అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సాంబశివరావు తెలిపారు. ఎస్‌ఆర్‌ఐ కాలేజీ చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ ప్రోత్సాహంతో 50 మంది అధ్యాపకులు బృందం అవెరా విద్యుత్ వాహన పరిశ్రమను మంగళవారం పరిశీలించింది. విద్యుత్ వాహనాల తయారీ ప్రక్రియ, మోటారు సిస్టం, బ్యాటరీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలను ఈ బృందం ప్రత్యక్షంగా చూసినట్లు కో ఆర్డినేటర్ చెప్పారు. విద్యార్థులకు గుణాత్మక బోధన అందించడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి అధ్యాపకులకు ఈ పర్యటన దోహదపడుతుందని చెప్పారు.